మనసులోమాట
KANCHARLA
నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం..
సంచలన తెలుగు దిన పత్రిక
తెలంగాణ
హైదరాబాద్ | రంగారెడ్డి | మహబూబ్ నగర్ | మెదక్ | నల్గొండ
నిజామాబాద్ | అదిలాబాద్ | కరీంనగర్ | వరంగల్ | ఖమ్మం
బుధవారం 20 మే 2026
పేజీ : 1

సబ్సిడీపై పచ్చిరొట్ట, జిప్సం పంపిణీ!

- భూసార సంరక్షణకు ప్రభుత్వం పెద్దపీట
- పచ్చిరొట్ట విత్తనాలకు 50 శాతం రాయితీ
- క్షార భూముల పునరుద్ధరణకు 90 శాతం సబ్సిడీపై జిప్సం
- 'రైతు నేస్తం' వేదికగా మంత్రి తుమ్మల

02

పాలమూరు పనుల్లో వేగం పెంచండి!

భూ సేకరణను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి

పెండింగ్ బిల్లుల చెల్లింపుల్లో జాప్యం వద్దు

అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం

ప్రతిష్ఠాత్మక పాలమూరుఉరంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు పనులను పరుగులు పెట్టించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. భూసేకరణ ప్రక్రియను యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తూ, పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని స్పష్టం చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మంత్రులు, ప్రజాప్రతినిధులతో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో సీఎం ఈ దిశానిర్దేశం చేశారు.

వివరాలు 2లో..

కాలంతో పాటు జర్నలిస్టులు మారాలి!

- డిజిటల్ యుగంలో ఆధునిక సాంకేతికతే ఆయుధం
- ఏఐ, సోషల్ మీడియా సవాళ్లపై అవగాహన పెంచుకోవాలి
- జర్నలిస్టులకు డిజిటల్ తరగతులు నిర్వహించాలి
- మీడియా అకాడమీ సమావేశంలో సీనియర్ల అభిప్రాయం

వివరాలు 5లో..

తెలంగాణ సంస్కృతిని దేశానికి చాటాలి!

- అధికారుల ఏర్పాట్లపై సీఎస్ వికాస్ రాజ్ సమీక్ష
- జూన్ 2న పరేడ్ గ్రౌండ్స్‌లో రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు

06

పాలమూరు ప్రాజెక్టులకు అత్యంత ప్రాధాన్యం!

- ప్రాజెక్టులపై ప్రభుత్వం ప్రత్యేక ఫోకస్
- జూరాల అభివృద్ధికి కేంద్రానికి లేఖ
- గత ప్రభుత్వ వైఫల్యాలపై ఉత్తమ్ ధ్వజం
- 12.30 లక్షల ఎకరాలకు సాగునీరే లక్ష్యం

04

వాట్సాప్‌లోనే జీహెచ్ఎంసీ సేవలు!

- కొత్తగా 9 రకాల పౌర సేవలు అందుబాటులోకి
- మీసేవ చాట్‌బాట్ ద్వారా సులభంగా దరఖాస్తు
- మంత్రి శ్రీధర్ బాబు నేతృత్వంలో డిజిటల్ విప్లవం



03

చెత్త నుంచి సంపద సృష్టి!

- రీసైక్లింగ్ ప్రాజెక్టులకు కేంద్రం తగిన ఆర్థిక సాయం అందించాలి
- ఢిల్లీ 'స్వచ్ఛ భారత్' భేటీలో ఉప ముఖ్యమంత్రి భట్టి
- వ్యర్థాల నిర్వహణ, సర్క్యులర్ ఎకానమీ దిశగా రాష్ట్రం అడుగులు

వివరాలు 4లో..

ప్రభుత్వ ఉద్యోగ వయోపరిమితి పెంపు!

44 ఏళ్లకు పెంపు.. మరో ఏడాది సడలింపు

హైదరాబాద్, మే 19 (మనసులో మాట ప్రతినిధి): ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో గరిష్ఠ వయోపరిమితిని ప్రభుత్వం మరో ఏడాది పొడిగించింది. ఈ మేరకు గరిష్ఠ వయోపరిమితిని 44 సంవత్సరాలకు పెంచుతూ ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. తాజాగా ఇచ్చిన సడలింపు ఏడాది పాటు అమల్లో ఉంటుందని జారీ చేసిన జీవోలో ప్రభుత్వం పేర్కొంది. అయితే పోలీసు, ఇతర యూనిఫామ్ సర్వీసులకు ఈ వయోపరిమితి సడలింపు వర్తించదని స్పష్టం చేసింది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ప్రభుత్వ ఉద్యోగాల నియామకాల్లో గరిష్ఠ వయోపరిమితిని మొదట పదేళ్ల పాటు సడలించారు. ఆ తర్వాత ఆ పరిమితిని మరో రెండేళ్ల పాటు పొడిగించడం జరిగింది. తాజాగా ఆ గడువు కూడా ముగియడంతో రాష్ట్రంలోని నిరుద్యోగ అభ్యర్థుల నుంచి పెద్ద ఎత్తున అభ్యర్థనలు వచ్చాయి. నిరుద్యోగుల విజ్ఞప్తులను సానుకూలంగా పరిశీలించిన ప్రభుత్వం, వారికి ప్రయోజనం చేకూర్చేలా మరో ఏడాది పాటు వయోపరిమితిని పొడిగిస్తూ తాజాగా ఈ కీలక నిర్ణయం తీసుకుంది.

యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ!

హైదరాబాద్, మే 19 (మనసులో మాట): నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలను పెంపొందించే దిశగా "నిర్మాణ్ సంస్థ" సహకారంతో ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధికల్పనాధికారి వందన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమం మే 21, 22 తేదీలలో హైదరాబాద్‌లోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం, మోడల్ కెరీర్ సెంటర్ నందు జరుగుతుందని వివరించారు. ఈ శిక్షణలో కెరీర్ గోల్ సెట్టింగ్, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, టీమ్ వర్క్, వ్యక్తిగత నైపుణ్యాలు, టైమ్ మేనేజ్ మెంట్, క్రమశిక్షణ, రెజ్యూమ్ తయారీ, ఇంటర్వ్యూ నైపుణ్యాలపై ప్రత్యేక శిక్షణ ఇస్తారు. వీటితో పాటు డిజిటల్ లిటరసీ, ఇంటర్నెట్ అవగాహన, ఫైనాన్షియల్ లిటరసీ, ఇండస్ట్రియల్ అవగాహన, సమస్యల పరిష్కారం, కస్టమర్ హ్యాండింగ్, వర్క్ ఎథిక్స్ వంటి కీలక అంశాలపై అభ్యర్థులకు పూర్తి అవగాహన కల్పిస్తారు. ఈ బ్యాచ్ కు పరిమితంగా 20 నుండి 30 మంది అభ్యర్థులను మాత్రమే ఎంపిక చేస్తామని వందన స్పష్టం చేశారు. ఆసక్తి గల నిరుద్యోగ యువతీ యువకులు వెంటనే తమ పేర్లను నమోదు చేసుకొని ఈ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర పూర్తి వివరాల కోసం హైదరాబాద్ లోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయాన్ని నేరుగా సంప్రదించాలని ఆమె సూచించారు.

టూరిస్ట్ గైడ్ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం!

హైదరాబాద్, మే 19 (మనసులో మాట): తెలంగాణ ప్రభుత్వ పర్యాటక శాఖ, వారసత్వ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో టూరిస్ట్ గైడ్ ప్రోగ్రామ్ఉ2026 శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. రాష్ట్రంలోని 33 జిల్లాలకు చెందిన, డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ ప్రోగ్రామ్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. పురావస్తు శాస్త్రం, చరిత్ర, వారసత్వం, సంస్కృతి, కళలు, శిల్పకళ, పర్యాటక రంగాలపై ప్రత్యేక ఆసక్తి ఉన్న అభ్యర్థులకు ఇది మంచి అవకాశం. ఈ రంగాలపై అవగాహనతో పాటు చక్కని కమ్యూనికేషన్ నైపుణ్యాలు కలిగిన అభ్యర్థులు ఈ సువర్ణావకాశాన్ని వినియోగించుకోవాలని పర్యాటక శాఖ అధికారులు సూచించారు. ఈ శిక్షణా కార్యక్రమానికి అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తు ఫారంతో పాటు తమకు సంబంధించిన అవసరమైన అన్ని విద్యా, ఇతర ధ్రువపత్రాలను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు.

సబ్సిడీపై పచ్చిరొట్ట, జిప్సం పంపిణీ!

- పచ్చిరొట్ట విత్తనాలకు 50 శాతం రాయితీ
- క్షార భూముల పునరుద్ధరణకు 90 శాతం సబ్సిడీపై జిప్సం
- 'రైతు నేస్తం' వేదికగా మంత్రి తుమ్మల వెల్లడి

హైదరాబాద్, మే 19 (మనసులో మాట ప్రతినిధి): తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా రైతులకు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడంతో పాటు పంట దిగుబడుల్లో కీలకపాత్ర పోషించే భూసార ఆరోగ్య పరిరక్షణ, రసాయన ఎరువుల వినియోగం తగ్గింపు లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రైతులకు 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు, 90 శాతం సబ్సిడీపై జిప్సం ఎరువులను అందిస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ వెల్లడించింది. ఈ నేపథ్యంలో నిర్వహించిన "రైతు నేస్తం" 92వ ఎపిసోడ్ కార్యక్రమంలో రాష్ట్రంలోని సుమారు 1,600 వేదికల ద్వారా వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యంతో రైతులు, వ్యవసాయ అధికారులు ప్రత్యక్షంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా రైతులకు సబ్సిడీ విత్తనాలు, ఎరువులు పంపిణీ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. భూమిలో సేంద్రియ కర్బనాన్ని పెంపొందించడానికి జీలుగ, జనుము, పిల్లిపెసర వంటి పచ్చిరొట్ట పంటలు ఎంతో దోహదపడతాయన్నారు. గత వానాకాలంఉ2025లో 0.87 లక్షల క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలను రూ.61.27 కోట్ల సబ్సిడీతో 1,89,395 మంది రైతులకు పంపిణీ చేశామని, తద్వారా 7.05 లక్షల ఎకరాల్లో సాగు జరిగిందని తెలిపారు. ప్రస్తుత వానాకాలంఉ2026లో రూ.113.27 కోట్ల సబ్సిడీతో 1.39 లక్షల క్వింటాళ్ల విత్తనాలను పంపిణీ చేసి, 11.22 లక్షల ఎకరాల్లో సాగు చేయడమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు.

క్షార భూముల పునరుద్ధరణకు జిప్సం

రాష్ట్రంలోని చౌడు, క్షార ప్రభావిత భూముల పునరుద్ధరణ కోసం "సాయిల్ హెల్త్ అండ్ ఫెర్టిలిటీ" పథకం కింద 90 శాతం సబ్సిడీపై జిప్సం అందిస్తున్నట్లు మంత్రి వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 22 జిల్లాల్లో 11,456 మెట్రిక్ టన్నుల జిప్సం పంపిణీకి ప్రణాళిక రూపొందించామని, ఇప్పటికే 10 జిల్లాల్లో 3,523 మెట్రిక్ టన్నుల జిప్సం సిద్ధంగా ఉంచామని చెప్పారు. వీటిపై క్షేత్రస్థాయిలో ఏఈఓలు, ఎంఏఓలు రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. అంతకుముందు వ్యవసాయ విశ్వవిద్యాలయ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీదేవి రైతులకు పలు సాంకేతిక వివరాలను అందించారు.

సాగు అనుభవాల పంపిణీ

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వదిలి ఖమ్మం జిల్లా రఘునాథపల్లిలో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న మహేష్, జిప్సం వాడకంతో లాభాలు గడించిన సంగారెడ్డి జిల్లా రంజోల్ గ్రామానికి చెందిన నాగేశ్వర్ రెడ్డి తమ అనుభవాలను పంచుకున్నారు. అలాగే పచ్చిరొట్ట పంటల ద్వారా రసాయన ఎరువుల వాడకం తగ్గించిన సిద్దిపేట జిల్లా శనిగరం గ్రామానికి చెందిన మహేందర్, నిజామాబాద్ జిల్లా ఆలూరుకు చెందిన సూర్యరెడ్డి తమ విజయగాథలను వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి కే. సురేంద్రమోహన్, సంచాలకులు బి. గోపి, ఉద్యానవన శాఖ సంచాలకులు యాస్మిన్ భాష, విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి పాల్గొన్నారు.

పాలమూరు పనుల్లో వేగం పెంచండి!

- భూ సేకరణను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి
- పెండింగ్ బిల్లుల చెల్లింపుల్లో జాప్యం వద్దు
- అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం

హైదరాబాద్, మే 19 (మనసులో మాట ప్రతినిధి): ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన మంత్రులు, శాసనసభ్యులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం ఎమ్ సీ ఆర్ మానవ వనరుల అభివృద్ధి సంస్థలో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలమూరు ప్రాంత అభివృద్ధిలో పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు కీలక పాత్ర పోషించనుందని, కాబట్టి దీని పనులను వేగవంతం చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో కొనసాగుతున్న సాగునీటి ప్రాజెక్టుల పురోగతి, ఎదురవుతున్న సమస్యలు, భూసేకరణ పరిస్థితులు, నిధుల విడుదల తదితర అంశాలపై ఈ భేటీలో విస్తృతంగా చర్చించారు. ప్రతి ప్రాజెక్టును వేగంగా పూర్తి చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. భూములు కోల్పోయిన రైతులు, బాధితులకు సరైన సమయంలో పరిహారం అందేలా చూడాలని, భూసేకరణ నిధుల విషయంలో ఎలాంటి ఆలస్యం జరగకుండా వెంటనే చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నిధుల కొరతతో అభివృద్ధి కార్యక్రమాలు నిలిచిపోకుండా ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని భరోసా ఇచ్చారు. పెండింగ్ లో ఉన్న బిల్లుల చెల్లింపుల విషయంలో కూడా ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. పనులు ఆగిపోకుండా అవసరమైన నిధులను విడుదల చేస్తామని తెలిపారు. ప్రాజెక్టుల పూర్తి విషయంలో నిర్లక్ష్యం చేసినా, ఆలస్యం చేసినా ఏమాత్రం సహించబోమని అధికారులను హెచ్చరించారు.

సాగునీటి పనులపై నిరంతర పర్యవేక్షణ..

ఉమ్మడి పాలమూరు జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు రైతుల భవిష్యత్తును మార్చే శక్తి కలిగి ఉన్నాయని ప్రభుత్వం భావిస్తోంది. ఈ ప్రాజెక్టులు పూర్తయితే వేలాది ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు భూగర్భ జలాల పరిస్థితి కూడా మెరుగుపడే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. వ్యవసాయ రంగానికి ఇది కీలక మలుపుగా మారే అవకాశం ఉన్నందున, జిల్లా మంత్రులు, ప్రజాప్రతినిధులు సంబంధిత అధికారులతో తరచూ సమీక్షలు నిర్వహించాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రాజెక్టుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. రాష్ట్రంలో సాగునీటి వసతుల విస్తరణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని ఈ సమావేశం ద్వారా స్పష్టమైంది. ఈ భేటీలో పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

వాట్సాప్‌లోనే జీహెచ్‌ఎంసీ సేవలు!

- కొత్తగా 9 రకాల పౌర సేవలు అందుబాటులోకి
- మీసేవ చాట్‌బాట్ ద్వారా సులభంగా దరఖాస్తు
- ఐటీ మంత్రి శ్రీధర్ బాబు నేతృత్వంలో డిజిటల్ విప్లవం
- 8096958096 నంబర్‌తో క్షణాల్లో పనులు



హైదరాబాద్, మే 19 (మనసులో మాట ప్రతినిధి): హైదరాబాద్ లోని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ) కు సంబంధించిన పలు పౌర సేవలను కొత్తగా మీ సేవ వాట్సాప్, చాట్‌బాట్ ద్వారా తెలంగాణ ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రజలకు మరింత సౌకర్యం, అందుబాటు, పారదర్శకత కల్పించే దిశగా ఈ సేవలను విస్తరించినట్లు ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ విభాగం కమిషనర్ తెలిపారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు నాయకత్వంలో మీసేవ ద్వారా పౌర సేవలను మరింతగా తీర్చిదిద్దుతున్నారు. గతేడాది నవంబర్ 18న ప్రారంభమైన ఈ వాట్సాప్ డిజిటల్ ఛానల్‌లో కొత్తగా 9 సేవలను చేర్చారు. ప్రాపర్టీ అసెస్‌మెంట్ రివిజన్, జనన ధ్రువీకరణ సవరణ, మరణ ధ్రువీకరణ సవరణ, ఇంటి దగ్గర పుట్టిన (బర్త్ హోమ్), చనిపోయిన (డెత్ హోమ్) వారి వివరాల నమోదును ఇందులో చేర్చారు. వీటితో పాటు ప్రాపర్టీ డోర్ నంబర్ సవరణ, ఆస్తి పేరు మార్పు, ప్రాపర్టీ ట్యాక్స్ సేవలు, ట్రేడ్ లైసెన్స్ నూతనీకరణ సేవలను ఇకపై వాట్సాప్ మీసేవలో సులభంగా పొందవచ్చు.

దరఖాస్తు చేసుకునే విధానం

ఈ సేవలు పొందేందుకు పౌరులు ముందుగా 8096958096 నంబర్‌ను మొబైల్‌లో 'మీసేవ తెలంగాణ' పేరుతో సేవ్ చేసుకోవాలి. అనంతరం వాట్సాప్‌లో ఆ నంబర్‌కు 'హాయ్' అని సందేశం పంపాలి. అవసరమైన సేవ పేరు టైప్ చేసి, మెనూలో కనిపించే 'ఓపెన్ సర్వీస్' ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. అక్కడ ఫారంలో అడిగిన వివరాలు నింపి, అవసరమైన చెల్లింపు పూర్తిచేస్తే దరఖాస్తు వెంటనే నమోదవుతుంది.

ప్రజల నుంచి మంచి స్పందన

వాట్సాప్ ఆధారిత మీసేవ వేదికకు ప్రారంభం నుంచి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని ప్రభుత్వం వెల్లడించింది. జనన ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, పోలీస్ చలాన్, విద్యుత్ బిల్లులు, బీఐఈ ఫలితాల సేవలను ప్రజలు ఇప్పటికే ఎక్కువగా వినియోగిస్తున్నారు. రోజువారీ పరిపాలన సేవలకు వాట్సాప్‌పై ప్రజల ఆధారపడటం పెరుగుతోందని, పౌరులకు సులభమైన అనుభవం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని అధికారులు పేర్కొన్నారు.

మెడికల్ కాలేజీల్లో ప్రొఫెసర్ల భర్తీ!

433 అసిస్టెంట్ ప్రొఫెసర్ల మెరిట్ జాబితా విడుదల

ఈ నెల 22, 23 తేదీల్లో ధ్రువపత్రాల పరిశీలన

హైదరాబాద్, మే 19 (మనసులో మాట): ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 433 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి సంబంధించిన ప్రొవిజనల్ మెరిట్ జాబితాను మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు మంగళవారం విడుదల చేసింది. ఈ ఉద్యోగాల భర్తీ కోసం ఒక్కో పోస్టుకు ముగ్గురు చొప్పున అభ్యర్థులను ధ్రువపత్రాల పరిశీలనకు బోర్డు ఆహ్వానించింది. ఈ నెల 22, 23 తేదీల్లో హైదరాబాద్ వెంగల్‌రావు నగర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ప్రాంగణంలో ఈ పరిశీలన ప్రక్రియ నిర్వహించనున్నారు. నిర్ణీత తేదీల్లో హాజరు కాలేని అభ్యర్థుల కోసం ఈ నెల 25న ధ్రువపత్రాలు సమర్పించేందుకు బోర్డు మరో అవకాశం కల్పించింది. మొత్తం 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ రాగా, అందులో ఇప్పటికే 174 పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తయింది. మిగిలిన 30 విభాగాల్లోని 433 పోస్టులకు తాజాగా ఈ మెరిట్ జాబితా విడుదల చేశారు. ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ పూర్తయిన తర్వాత తుది ఎంపిక జాబితాను అధికారికంగా ప్రకటించనున్నట్లు బోర్డు స్పష్టం చేసింది

తెలంగాణ బ్యాడ్మింటన్‌కు స్వర్ణ కిరీటాలు!

జాతీయ సబ్ జూనియర్ టోర్నీలో ఘన విజయం

సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో పతకాల పంట

హైదరాబాద్, మే 19 (మనసులో మాట): గోవాలో జరిగిన ప్రతిష్టాత్మక యోనెక్స్ సన్‌రైజ్ ఆల్ ఇండియా సబ్ జూనియర్ అండర్-13 ర్యాంకింగ్ టోర్నమెంట్‌లో తెలంగాణకు చెందిన యువ బ్యాడ్మింటన్ క్రీడాకారులు అద్భుత ప్రతిభ కనబరిచారు. సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో స్వర్ణ పతకాలు సాధించి తెలంగాణ క్రీడా వైభవాన్ని జాతీయ స్థాయిలో మరోసారి చాటిచెప్పారు. ఈ టోర్నీలో రాష్ట్రానికి చెందిన షాన్వి రెడ్డి నిమ్మా, అయోషా కోరుకొండ సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో బంగారు పతకాలను కైవసం చేసుకున్నారు. అలాగే అండర్-13 బాలుర విభాగంలో ఆరోర కూడా స్వర్ణ పతకం సాధించి తెలంగాణకు మరింత గౌరవాన్ని తీసుకొచ్చారు. టోర్నమెంట్ మొత్తం అసాధారణ ఆటతీరుతో ప్రత్యర్థులను అధిగమిస్తూ ఫైనల్ వరకు వీరంతా అజేయ ప్రదర్శన కనబరిచి అందరి ప్రశంసలు అందుకున్నారు. చిన్న వయసులోనే ఒత్తిడిని తట్టుకొని వీరు చూపించిన ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, పట్టుదలే ఈ విజయాలకు ప్రధాన బలంగా నిలిచాయని కోచ్‌లు పేర్కొన్నారు. రాష్ట్ర యువతకు ఆదర్శంగా నిలుస్తున్న ఈ విజయాలు మరెందరో చిన్నారుల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందిస్తున్నాయని క్రీడా వర్గాలు తెలిపాయి. భవిష్యత్తులో అంతర్జాతీయ వేదికలపై కూడా దేశానికి పతకాలు తీసుకురావాలని క్రీడాభిమానులు ఆకాంక్షిస్తున్నారు. ఈ సందర్భంగా విజేతలను బ్యాడ్మింటన్ క్రీడా ప్రతినిధులు, కోచ్‌లు, మాజీ క్రీడాకారులు హృదయపూర్వకంగా అభినందించారు.

ప్రజా సమస్యలపై సానుకూలంగా స్పందించాలి!

ఆదిలాబాద్ ప్రజావాణి పైలట్ ప్రాజెక్ట్ నివేదిక ఆవిష్కరణ

సమస్యల మూలాల్ని అర్థం చేసుకుంటేనే పరిష్కారం

మండల స్థాయికి కూడా ప్రజావాణి విస్తరణ

చిన్నారెడ్డి, దివ్య దేవరాజన్ ఆధ్వర్యంలో కార్యక్రమం

హైదరాబాద్, మే 19 (మనసులో మాట): ప్రగతిశీల భావజాలం ఉంటేనే ప్రజావాణికి వచ్చే సమస్యల మూలాలు అర్థమై, వాటి పరిష్కారానికి మార్గం సుగమం అవుతుందని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్, సీఎం ప్రజావాణి ఇంచార్జ్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి అన్నారు. మహాత్మా జ్యోతిబాపూలే ప్రజా భవన్‌లో మంగళవారం జరిగిన ఒక కార్యక్రమంలో ఆదిలాబాద్ జిల్లా ప్రజావాణి అమలు తీరుపై రూపొందించిన పైలట్ ప్రాజెక్టు నివేదికను ఆయన ఆవిష్కరించారు. సీఎం ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్, ఇతర నిర్వాహకులతో కలిసి ఈ నివేదికను విడుదల చేశారు. ప్రజావాణికి వివిధ రకాల సమస్యలతో వచ్చే దరఖాస్తుదారుల పట్ల అధికారులు, సిబ్బంది సానుకూల ధోరణితో స్పందించాలని చిన్నారెడ్డి సూచించారు. అప్పుడే పిటిషనర్ల ముఖాల్లో సంతోషం చూడగలుగుతామన్నారు. ముఖ్యమంత్రి ప్రజావాణిలో అత్యంత ఓపికతో ప్రజల సమస్యలను పరిష్కరిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలో విజయవంతంగా కొనసాగుతున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ఇప్పటికే డివిజన్ స్థాయికి విస్తరించామని చిన్నారెడ్డి తెలిపారు. రానున్న రోజుల్లో దీనిని మండల స్థాయిలో కూడా నిర్వహించాలనే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీఎం ప్రజావాణి అధికారులు రాకేష్ రెడ్డి, జగన్, సహదేవ్, సాయి, నిర్వాహకులు హర్ష, ఆనందిత, అభిషేక్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ షాపుల బంద్.. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు!

మందుల కొరత లేకుండా డ్రగ్స్ కంట్రోల్ చర్యలు

ఆసుపత్రుల మెడికల్ స్టోర్లు తెరిచే ఉంటాయి

కార్పొరేట్ ఫార్మసీలు కూడా అందుబాటులో

సాయం కోసం ఉచిత ఫోన్ నంబర్ విడుదల

హైదరాబాద్, మే 19 (మనసులో మాట): దేశవ్యాప్తంగా కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ సంఘం పిలుపునిచ్చిన మే 20 బంద్ నేపథ్యంలో ప్రజలకు అత్యవసర, ప్రాణరక్షక మందుల కొరత తలెత్తకుండా తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ విభాగం కీలక చర్యలు చేపట్టింది. సంఘ ప్రతినిధులతో అధికారులు జరిపిన చర్చల అనంతరం ఆసుపత్రులకు అనుబంధంగా ఉండే మెడికల్ షాపులను తెరిచి ఉంచాలని నిర్ణయించారు. అత్యవసర పరిస్థితుల్లో మందులు అందుబాటులో ఉండేలా జిల్లా స్థాయి ప్రతినిధులు డ్రగ్ ఇన్‌స్పెక్టర్లతో సమన్వయం చేసుకుంటారు. అపోలో, మెడ్‌ప్లస్ వంటి కార్పొరేట్ మెడికల్ స్టోర్లు కూడా యథావిధిగా పని చేస్తాయని అధికారులు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా మందుల లభ్యతపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతోందని అధికారులు తెలిపారు. ప్రజలకు మందుల లభ్యతలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ లేదా అసిస్టెంట్ డైరెక్టర్‌ను సంప్రదించవచ్చు. అధికారుల సంప్రదింపు వివరాలు అధికారిక వెబ్‌సైట్‌లోని ముఖ్య సంప్రదింపుల విభాగంలో అందుబాటులో ఉంచారు. ఏదైనా అత్యవసర సాయం కోసం ప్రజలు ఉచిత నంబర్ 1800 599 6969 కు ఫోన్ చేయవచ్చని అధికారులు సూచించారు.

జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డుల పంపిణీ!

కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ చేతుల మీదుగా అందజేత

కామారెడ్డి, మే 19 (మనసులో మాట): జిల్లాలో అర్హులైన జర్నలిస్టులకు 2026ఉ2028 సంవత్సరానికి సంబంధించి మంజూరైన తొలి విడత మీడియా అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియ ప్రారంభమైంది. లిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్ విక్టర్‌తో కలిసి కమిటీ సభ్యులు, జర్నలిస్టులకు ఈ నూతన కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమం సందర్భంగా జిల్లా పౌర సంబంధాల అధికారిణి, కన్వీనర్ బి. తిరుమల, మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు రజనీకాంత్, ఉక్కల్ కర్ రాజేందర్ నాథ్, సయ్యద్ కౌసర్ అలీ, పాత్రికేయ మిత్రులు హరీష్, శ్రీనివాస్ తదితరులు కలెక్టర్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. జిల్లాలో అర్హులైన జర్నలిస్టులందరికీ ఈ కార్డులు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని ఈ సందర్భంగా ప్రతినిధులు సంతోషం వ్యక్తం చేశారు.

జలమండలిలో ఉద్యోగాలంటూ అసత్య ప్రచారం!

సోషల్ మీడియా పోస్టర్లపై అప్రమత్తత అవసరం

ప్రస్తుతం ఎలాంటి నియామకాలు లేవని స్పష్టీకరణ

పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారానే భర్తీ

తప్పుడు వార్తలను నమ్మవద్దని బోర్డు విజ్ఞప్తి

హైదరాబాద్, మే 19 (మనసులో మాట): ఇటీవల సోషల్ మీడియా వేదికగా జలమండలిలో ఉద్యోగ నియామకాల పేరుతో జరుగుతున్న ప్రచారం పూర్తిగా అసత్యమని హైదరాబాద్ నీటి సరఫరా బోర్డు స్పష్టం చేసింది. భారీ స్థాయిలో ఉద్యోగాలు ఉన్నట్లు అర్హతలు, జీతాల వివరాలతో చక్కర్లు కొడుతున్న పోస్టర్ కేవలం తప్పుడు ప్రచారం మాత్రమేనని వెల్లడించింది. ప్రస్తుతం జలమండలిలో ఎలాంటి నియామక ప్రక్రియ చేపట్టలేదని అధికారులు తెలిపారు. ఇటువంటి అసత్య ప్రకటనలను చూసి నిరుద్యోగులు, అభ్యర్థులు మోసపోవద్దని హెచ్చరించారు. సోషల్ మీడియాలో వచ్చే నిర్ధారణ లేని వార్తలను, పోస్టర్లను నమ్మవద్దని బోర్డు విజ్ఞప్తి చేసింది. జలమండలిలో ఉద్యోగాల భర్తీ చేపట్టాల్సి వస్తే ప్రభుత్వ నిబంధనల ప్రకారం తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ లేదా సంబంధిత అధికారిక సంస్థల ద్వారానే ప్రకటనలు విడుదల చేస్తామని స్పష్టం చేసింది. ఇందుకు సంబంధించిన సమాచారాన్ని ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్లు, విశ్వసనీయ మీడియా వేదికల ద్వారానే ప్రకటిస్తామని తెలిపింది. అభ్యర్థులు కేవలం అధికారిక సమాచారాన్ని మాత్రమే అనుసరించాలని సూచించింది.

చెత్త నుంచి సంపద సృష్టి!

- ఢిల్లీ 'స్వచ్ఛ భారత్' భేటీలో ఉప ముఖ్యమంత్రి భట్టి
- వ్యర్థాల నిర్వహణ, సర్క్యులర్ ఎకానమీ దిశగా రాష్ట్రం అడుగులు
- జపాన్ తరహాలో పాఠశాల స్థాయి నుంచే పరిశుభ్రత పాఠాలు
- రీసైక్లింగ్ ప్రాజెక్టులకు కేంద్రం తగిన ఆర్థిక సాయం అందించాలి

న్యూఢిల్లీ, మే 19 (మనసులో మాట ప్రతినిధి): దేశవ్యాప్తంగా పట్టణ పరిశుభ్రత, ఘన వ్యర్థాల నిర్వహణ వ్యవస్థలను బలోపేతం చేసే లక్ష్యంతో న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ అధ్యక్షతన 'స్వచ్ఛ భారత్ మిషన్ఉఅర్బన్ 2.0' జాతీయ సమీక్ష సమావేశం జరిగింది. మంగళవారం ప్రారంభమైన ఈ భేటీకి తెలంగాణ తరఫున ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హాజరయ్యారు. రాష్ట్రంలో అమలవుతున్న శాస్త్రీయ వ్యర్థాల నిర్వహణ, సుస్థిర పట్టణాభివృద్ధి, సర్క్యులర్ ఎకానమీ విధానాలను ఆయన ఈ వేదికగా దేశానికి వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ విజన్-2047 లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్రాన్ని సుస్థిరంగా, పర్యావరణహితంగా అభివృద్ధి చేస్తున్నట్లు భట్టి తెలిపారు. పట్టణ, సెమీ అర్బన్, గ్రామీణ వ్యవసాయ ప్రాంతాల సమతుల్య అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ఘన వ్యర్థాల నిర్వహణ అనేది కేవలం చెత్త సేకరణకే పరిమితం కాకుండా వాతావరణ మార్పులకు ప్రతిస్పందనగా, ఉపాధి కల్పనతో ముడిపడి ఉందని స్పష్టం చేశారు. వికేంద్రీకృత వ్యర్థాల ప్రాసెసింగ్, పాత డంప్ యార్డుల శాస్త్రీయ శుద్ధికి రాష్ట్రం పెద్దపీట వేస్తోందని చెప్పారు. కర్బన ఉద్గారాలను తగ్గించే ఉద్దేశంతో రాష్ట్రంలోని ప్రధాన పట్టణ ప్రాంతాల్లో 9,596 ఎలక్ట్రిక్ స్వచ్ఛ ఆటో టిప్పర్లను ప్రవేశపెడుతున్నట్లు ఉప ముఖ్యమంత్రి వెల్లడించారు. క్యూఆర్ కోడ్ ఆధారిత పర్యవేక్షణతో ఇంటింటి చెత్త సేకరణను మరింత సమర్థవంతంగా అమలు చేయనున్నట్లు వివరించారు. తడి చెత్తను స్థానికంగానే ప్రాసెస్ చేయడం, పొడి చెత్తను రీసైక్లింగ్ చేసి సర్క్యులర్ ఎకానమీలోకి తీసుకురావడం ప్రభుత్వ ప్రధాన విధానమని పేర్కొన్నారు.

డంప్ యార్డుల సమూల మార్పు

పాత డంప్ యార్డుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా జవహర్‌నగర్ డంప్ యార్డ్ విషయంలో ఐఐటీ బాంబే సాంకేతిక సహకారం తీసుకుంటున్నామని తెలిపారు. ఆటోనగర్ ప్రాంతంలో 40 ఎకరాల్లో ఉన్న 22 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను బయోమైనింగ్ విధానంలో తొలగిస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే 30 శాతం పనులు పూర్తయ్యాయని, భవిష్యత్తులో ఆ స్థలాలను పార్కులు, క్రీడా మైదానాలుగా మారుస్తామన్నారు. జపాన్ దేశంలోని కిటాక్యుషు నగర అభివృద్ధి నమూనా ఆధారంగా రాష్ట్రంలో ఎకో టౌన్ నిర్మాణానికి అడుగులు వేస్తున్నామని గుర్తుచేశారు. 'వార్ ఆన్ వేస్ట్ ఉ వేస్ట్ టు వెల్త్' నినాదంతో చెత్త నుంచి సంపద సృష్టించే దిశగా పనులు చేస్తున్నామన్నారు. పరిశుభ్రత ప్రజల జీవనశైలిలో భాగం కావాలంటే, జపాన్ తరహాలో ఒకటో తరగతి నుంచే పాఠశాలల్లో విద్యార్థులకు పరిశుభ్రత పాఠాలు బోధించే విధానాన్ని అన్ని రాష్ట్రాలు పరిశీలించాలని సూచించారు. చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి, సర్క్యులర్ ఎకానమీ ప్రాజెక్టుల ఏర్పాటుకు కేంద్రం తగిన ఆర్థిక సాయం అందించాలని కోరారు. ఆధునిక సదుపాయాల ఏర్పాటుకు వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమీక్షా సమావేశంలో కేంద్ర మంత్రులు, సంబంధిత అధికారులతో పాటు తెలంగాణ ఉన్నతాధికారులు జయేష్ రంజన్, మానిక్ రాజ్, ఆర్వీ కర్ణన్ తదితరులు పాల్గొన్నారు.

పాలమూరు ప్రాజెక్టులకు అత్యంత ప్రాధాన్యం!

- పాలమూరు ప్రాజెక్టులపై ప్రభుత్వం ప్రత్యేక ఫోకస్
- జూరాల అభివృద్ధికి కేంద్రానికి లేఖ
- గత ప్రభుత్వ వైఫల్యాలపై ఉత్తమ్ ధ్వజం
- 12.30 లక్షల ఎకరాలకు సాగునీరే లక్ష్యం

హైదరాబాద్, మే 19 (మనసులో మాట): పాలమూరు ప్రాంతంలో చారిత్రక వెనుకబాటుతనం, దీర్ఘకాలిక కరువు పరిస్థితులను అధిగమించేందుకు అక్కడి సాగునీటి ప్రాజెక్టులకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. సచివాలయంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రులు జూపల్లి కృష్ణా రావు, వాకాటి శ్రీహరి పాల్గొన్నారు. జూరాల ప్రాజెక్టులో భారీగా మట్టి చేరడం వల్ల నీటి నిల్వ సామర్థ్యం 8 టీఎంసీల కంటే తగ్గిపోయిందని మంత్రి పేర్కొన్నారు. డ్యామ్ పునరుద్ధరణ, మెరుగుదల పథకం (డీఆర్ఐపీ) కింద జూరాలకు ఆర్థిక సహాయం అందించాలని కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖకు ప్రతిపాదనలు పంపినట్లు వెల్లడించారు. కేంద్ర నిధులతో పూడికతీత పనులు చేపడితే జూరాల భద్రత, నిల్వ సామర్థ్యం, నిర్వహణ మెరుగుపడతాయని తెలిపారు. వానాకాలానికి ముందే చెరువుల పూడికతీత, కాలువల మరమ్మతులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

గత ప్రభుత్వ వైఫల్యాలపై విమర్శలు

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం 90 శాతం పూర్తయిందన్న బీఆర్ఎస్ వాదనలను మంత్రి ఖండించారు. ఆఫ్‌టేక్ పాయింట్‌ను జూరాల నుంచి మార్చడం వల్ల ప్రాజెక్టుకు తీవ్ర నష్టం జరిగిందని విమర్శించారు. కాలువల భూసేకరణ పూర్తికాకుండానే టెండర్లు పిలవడం వల్ల పనుల్లో ఇబ్బందులు ఎదురయ్యాయని, గత పదేళ్ల అన్యాయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం సరిదిద్దుతుందని హామీ ఇచ్చారు. మరో పక్షం రోజుల్లోనే పాలమూరు ప్రాజెక్టులపై ప్రత్యేక సమీక్ష నిర్వహించి పనులను వేగవంతం చేస్తామన్నారు.

12 లక్షల ఎకరాలకు సాగునీరు

పాలమూరు-రంగారెడ్డి పథకం ద్వారా దక్షిణ తెలంగాణలోని కరువు జిల్లాల్లో సుమారు 12.30 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే కాకుండా తాగునీటి అవసరాలు తీరుస్తామని మంత్రి చెప్పారు. మొదటి దశలో నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, నారాయణపేట, వికారాబాద్, రంగారెడ్డి, నల్గొండ జిల్లాల్లోని తాగునీరు అందిస్తామని వివరించారు. ప్రాధాన్యాల వారీగా పనుల అమలు షెడ్యూల్‌పై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

కాలంతో పాటు జర్నలిస్టులు మారాలి!

- డిజిటల్ యుగంలో ఆధునిక సాంకేతికతే ఆయుధం
- ఏఐ, సోషల్ మీడియా సవాళ్లపై అవగాహన పెంచుకోవాలి
- జర్నలిస్టులకు డిజిటల్ తరగతులు నిర్వహించాలి
- మీడియా అకాడమీ సమావేశంలో సీనియర్ల అభిప్రాయం

హైదరాబాద్, మే 19 (మనసులో మాట ప్రతినిధి): నేటి డిజిటల్ యుగంలో జర్నలిజం రంగం వేగంగా మారుతున్న నేపథ్యంలో మీడియా వృత్తిదారులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని ముందుకు సాగాలని సీనియర్ జర్నలిస్టులు అభిప్రాయపడ్డారు. తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన నాంపల్లిలోని అకాడమీ భవనంలో మంగళవారం ప్రత్యేక చర్చా కార్యక్రమం జరిగింది. ఇందులో పలువురు సీనియర్లు, అకాడమీ అనుబంధ సభ్యులు పాల్గొని మీడియా రంగ భవిష్యత్, డిజిటలీకరణ, మీడియా చట్టాలు, జర్నలిస్టుల సంక్షేమంపై విస్తృతంగా చర్చించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సమాచార, పౌర సంబంధాల శాఖ ప్రత్యేక ప్రధాన కమిషనర్ జి. ముకుంద్ రెడ్డి జర్నలిస్టులను అభినందించారు. తన విద్యార్థి దశలో పత్రికల సంపాదకీయాలు చదవడం ద్వారానే సివిల్ సర్వీసులపై ఆసక్తి పెరిగిందని, అదే తన విజయానికి పునాది అని ఆయన గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ జర్నలిజం సమాజానికి అద్దం పట్టే వృత్తి అని, భయపడకుండా నిజాయితీతో వార్తలను ప్రజలకు అందించాల్సిన బాధ్యత జర్నలిస్టులపై ఉందని పేర్కొన్నారు.

కాలానుగుణంగా నైపుణ్యాల పెంపు

కృత్రిమ మేధస్సు (ఏఐ) ప్రభావం పెరుగుతున్న తరుణంలో జర్నలిస్టులు కొత్త సాంకేతికతపై కచ్చితంగా అవగాహన పెంచుకోవాలని సభ్యులు సూచించారు. అకాడమీ ఆధ్వర్యంలో డిజిటల్ తరగతులు, ఇంటర్న్‌షిప్ కార్యక్రమాలు, డెస్క్ జర్నలిస్టులకు ప్రత్యేక శిక్షణలు ఇవ్వాలని ఉదుముల సుధాకర్ రెడ్డి కోరారు. సీనియర్ జర్నలిస్టుల వీడియోలను పుస్తకాల రూపంలోకి తేవాలని దేవులపల్లి అమర్ సూచించారు. పాత పత్రికలు, అరుదైన నిజాం కాలం నాటి ప్రచురణలను డిజిటలైజ్ చేసి భావితరాలకు అందించాలని కోరారు.

సోషల్ మీడియాకు నియమావళి అవసరం

ప్రస్తుత పరిస్థితుల్లో మీడియా చట్టాల్లో కాలానుగుణ మార్పులు తీసుకురావాలని, ముఖ్యంగా సోషల్ మీడియాకు ప్రత్యేక ప్రవర్తనా నియమావళి రూపొందించాలని సీనియర్లు స్పష్టం చేశారు. మహిళా, గ్రామీణ ప్రాంత జర్నలిస్టుల కోసం ప్రత్యేక శిక్షణలు ఏర్పాటు చేయాలన్నారు. మీడియా అకాడమీ భవనంలోని డిజిటల్ సదుపాయాలను మరింత సమర్థవంతంగా వినియోగించుకోవాలని కోరారు. తమ వద్దనున్న విలువైన పుస్తకాలను అకాడమీ లైబ్రరీకి విరాళంగా ఇస్తామని ఐ. వెంకట్ రావుతో పాటు పలువురు సీనియర్లు తెలిపారు. ఈ సమావేశంలో సీనియర్ జర్నలిస్టులు ఐ. వెంకట్ రావు, మాజీ ఎమ్మెల్సీ అమీర్ అలీ ఖాన్, కె. రాంచందర్ మూర్తి, కేశవరావు దాసు, ఎస్. నాగేష్ కుమార్, బండారు శ్రీనివాస్ రావు, రవీందర్, దిలీప్ రెడ్డి, మాదభూషి శ్రీధర్, ఎం. సుబ్బారావు, జగన్, ఆర్.వి. రామారావు, ఎస్. వినయ్ కుమార్, వై. నరేందర్ రెడ్డి, విరాహత్ అలీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హాజరైన ప్రముఖులను అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వర రావులు శాలువాలతో ఘనంగా సత్కరించారు.

నగరంలో దారుణాలు.. వరుస లైంగిక దాడులు

సినిమా షూటింగ్ ఆశ చూపి యువతిపై లైంగిక దాడి

ఇబ్రహీంపట్నంలో బీటెక్ విద్యార్థినిపై తోటివాడే ఘాతుకం

నిందితుడు ఉడుతల ఉదయ్ అరెస్ట్, రిమాండ్

బాధితులకు గాంధీ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు

హైదరాబాద్, మే 19 (మనసులో మాట): భాగ్యనగరంలో వరుసగా వెలుగుచూస్తున్న దారుణ అత్యాచార ఘటనలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. అమ్మాయిలను మోసం చేస్తూ కామాంధులు రెచ్చిపోతున్నారు. కేసులు నమోదవుతున్నా భయం లేకుండా తెగిస్తున్నారు. సికింద్రాబాద్‌లో ఒక యువతిపై ఇద్దరు వ్యక్తులు రెండు రోజుల పాటు లైంగిక దాడికి పాల్పడగా, ఇబ్రహీంపట్నంలో బీటెక్ విద్యార్థినిపై తోటి విద్యార్థి మద్యం తాగించి ఘాతుకానికి ఒడిగట్టాడు.

షూటింగ్ పేరుతో గదికి తీసుకెళ్లి..

సినిమా షూటింగ్ ఆశ చూపి ఒక యువతిపై ఇద్దరు యువకులు లైంగిక దాడికి పాల్పడిన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైంది. జూబ్లీహిల్స్ మెట్రో స్టేషన్ సమీపంలో ఇద్దరు యువతులు నివసిస్తూ, సినిమాల్లో చిన్న చిన్న పాత్రలు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వారిలో ఒక యువతికి సినిమా షూటింగ్ ఉందంటూ ఒక యువకుడు మాయమాటలు చెప్పి నమ్మించాడు. అది నిజమని నమ్మిన ఆమె ఆ యువకుడితో కలిసి సికింద్రాబాద్ వెళ్లింది. అక్కడ ఒక గదికి తీసుకెళ్లిన ఆ యువకుడు, తన స్నేహితుడితో కలిసి ఆమెపై రెండు రోజుల పాటు దారుణంగా లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆ తర్వాత ఈ నెల 16న రాపిడో బైక్ బుక్ చేసి ఆమెను తిరిగి ఇంటికి పంపించేశారు. బాధితురాలి శరీరంపై గాయాలు ఉండటాన్ని గమనించిన ఆమె స్నేహితురాలు, వెంటనే ఆమెను గాంధీ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించింది. అక్కడ వైద్యులు ప్రశ్నించడంతో జరిగిన దారుణాన్ని బాధితురాలు వివరించింది. ఈ ఘటనపై జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మద్యం తాగించి విద్యార్థినిపై వికృత చేష్టలు

మరో దారుణం ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌కు చెందిన ఉడుతల ఉదయ్, ఇబ్రహీంపట్నం సమీపంలోని ఒక ఇంజనీరింగ్సి కళాశాలలో బీటెక్ మూడోసంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల 14న తనతో పాటు చదువుతున్న ఒక యువతిని టీ తాగుదామని కారులో దిల్ సుఖ్ నగర్‌కు తీసుకెళ్లాడు. టీ తాగిన తర్వాత తిరుగు ప్రయాణంలో ఉదయ్ మద్యం కొనుగోలు చేశాడు. ఆ తర్వాత బీఎన్ రెడ్డి రోడ్డులోని ఒక నిర్మానుష్య ప్రదేశానికి కారులో ఆమెను తీసుకెళ్లి, బలవంతంగా మద్యం తాగించాడు. మత్తులో ఉన్న ఆమెను తన గదికి తీసుకెళ్లి అత్యాచారానికి ఒడిగట్టాడు. బాధితురాలి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన ఇబ్రహీంపట్నం పోలీసులు నిందితుడు ఉడుతల ఉదయ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. బాధితురాలిని వైద్య పరీక్షల నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

లూలూ హైపర్ మార్కెట్‌పై ఫుడ్ సేఫ్టీ దాడులు!

కూకట్‌పల్లి బ్రాంచ్‌లో అధికారుల ఆకస్మిక తనిఖీలు

150 కిలోల పాడైపోయిన ఆహార పదార్థాలు సీజ్

పురుగులు, అపరిశుభ్ర వాతావరణం గుర్తింపు

గడువు ముగిసిన లైసెన్స్‌తో విక్రయాలు

హైదరాబాద్, మే 19 (మనసులో మాట): నగరంలోని కూకట్‌పల్లిలో గల ప్రసిద్ధ లూలూ హైపర్ మార్కెట్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారులు మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ప్రజారోగ్యానికి తీవ్ర హాని కలిగించే విధంగా ఉన్న దాదాపు 150 కిలోల ఆహార పదార్థాలను అధికారులు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. హైపర్ మార్కెట్‌లో తనిఖీలు చేపట్టిన అధికారులకు అక్కడి నిల్వల్లో విస్తుపోయే నిజాలు కనిపించాయి. పలు ఆహార పదార్థాల్లో పురుగులు ఉండటాన్ని వారు గుర్తించారు. నాసిరకం వస్తువులను పెద్ద ఎత్తున నిల్వ ఉంచినట్లు కనుగొన్నారు. వంటగది అత్యంత అపరిశుభ్రంగా ఉండటంతో పాటు, పాడైపోయిన కూరగాయల పరిసరాల్లో పురుగులు సంచరిస్తున్నట్లు అధికారులు గమనించారు. గడువు సమీపించిన ఆహార పదార్థాలపై వినియోగదారులను తప్పుదోవ పట్టించేలా కొత్త లేబుళ్లు అతికించినట్లు తనిఖీల్లో తేలింది. గడువు ముగిసిపోయిన ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్‌తోనే ప్యాక్ చేసిన ఆహార పదార్థాలను విక్రయిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. వీటితో పాటు మార్కెట్ నుంచి బయటకు వెళ్లే డ్రైనేజీ వ్యవస్థ సైతం మాంసాహార వ్యర్థాలతో పూర్తిగా మూసుకుపోయింది. ఆహార పదార్థాల్లో కల్తీ, అధికంగా కృత్రిమ రంగులు వాడినట్లు అనుమానం రావడంతో అధికారులు పలు నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపారు.

కవాడిగూడలో ఘోరం.. స్పా సెంటర్‌లో భార్య హత్య!

కత్తితో విచక్షణారహితంగా నరికిన భర్త

అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో నిందితుడు లొంగిపాటు

కుటుంబ గొడవలే దారుణానికి కారణం

హైదరాబాద్, మే 19 (మనసులో మాట): గాంధీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కవాడిగూడలో మంగళవారం ఒక దారుణ ఘటన వెలుగుచూసింది. కట్టుకున్న భార్యను ఓ భర్త అతి కిరాతకంగా కత్తితో పొడిచి చంపేశాడు. ఈ ఘోర హత్య అనంతరం నిందితుడు నేరుగా వెళ్లి పోలీసుల ఎదుట లొంగిపోయాడు. పోలీసుల వివరాల ప్రకారం.. బహదూర్‌పురా కిషన్‌బాగ్‌కు చెందిన బంగి దేబోరా అనే మహిళ తన భర్తతో కలిసి నివసిస్తోంది. ఆమె కవాడిగూడలోని ఒక స్పా సెంటర్‌లో బ్యూటీషియన్‌గా పని చేస్తోంది. కొంతకాలంగా ఈ భార్యాభర్తల మధ్య తీవ్రమైన కుటుంబ గొడవలు జరుగుతున్నాయి. మంగళవారం ఉదయం కూడా వీరిద్దరి మధ్య పెద్ద గొడవ జరిగింది. ఆ తర్వాత దేబోరా తన విధుల నిమిత్తం కవాడిగూడలోని స్పా సెంటర్‌కు వెళ్ళిపోయింది.

కత్తితో విచక్షణారహితంగా దాడి

భార్యపై తీవ్ర ఆగ్రహంతో ఉన్న భర్త.. ఆమె పనిచేసే కవాడిగూడ రత్నదీప్ బిల్డింగ్‌లోని నాలుగో అంతస్తులో ఉన్న స్పా సెంటర్‌కు చేరుకున్నాడు. తన వెంట తెచ్చుకున్న కత్తితో దేబోరాపై విచక్షణారహితంగా దాడి చేశాడు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన ఆమె రక్తపు మడుగులో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. హత్య చేసిన అనంతరం నిందితుడు అక్కడి నుంచి పరారై, ఆ తర్వాత అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు. ఈ సమాచారం అందుకున్న గాంధీనగర్ పోలీసులు వెంటనే ఘటన స్థలానికి చేరుకున్నారు. దేబోరా మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ దారుణ హత్యపై కేసు నమోదు చేసిన పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు జరుపుతున్నారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

రోడ్డుపై చెలరేగిన మంటలు.. కారు దగ్ధం!

ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలో ప్రమాదం

ఇచ్చోడ, మే 19 (మనసులో మాట): ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలోని జాతీయ రహదారిపై మంగళవారం ఒక కారు అగ్నికి ఆహుతైంది. కారు ఆదిలాబాద్ నుంచి నిర్మల్ వైపు వెళ్తున్న సమయంలో ఈ ప్రమాదం సంభవించింది. ప్రయాణంలో ఉండగా ఒక్కసారిగా ఇంజిన్ లోంచి మంటలు చెలరేగాయి. కారులో మంటలు రావడం గమనించిన స్థానికులు వెంటనే అప్రమత్తమయ్యారు. వారు క్షణాల్లో స్పందించి కారులో ఉన్న ప్రయాణికులను సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. స్థానికుల సమయస్ఫూర్తి వల్ల ఒక పెద్ద ప్రాణ ప్రమాదం తప్పింది. ప్రయాణికులంతా ఎటువంటి గాయాలు లేకుండా బయటపడటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ప్రయాణికులు కిందకు దిగిన కొద్దిసేపటికే మంటలు కారు మొత్తానికి వేగంగా వ్యాపించాయి. క్షణాల వ్యవధిలోనే కారు పూర్తిగా దగ్ధమైపోయింది. ఈ ప్రమాదంపై సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటన స్థలానికి చేరుకున్నారు. వారు నీటిని చల్లి మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకొచ్చారు.

తెలంగాణ సంస్కృతిని దేశానికి చాటాలి!

- జూన్ 2న పరేడ్ గ్రౌండ్స్‌లో రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు
- అధికారుల ఏర్పాట్లపై సీఎస్ వికాస్ రాజ్ సమీక్ష
- గన్ పార్క్ వద్ద అమరవీరులకు సీఎం నివాళి
- ప్రభుత్వ భవనాలకు దేదీప్యమానంగా విద్యుత్ అలంకరణ

హైదరాబాద్, మే 19 (మనసులో మాట ప్రతినిధి): జూన్ 2వ తేదీన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని అత్యంత ఘనంగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ ఉన్నతాధికారులను ఆదేశించారు. మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సంబంధిత అధికారులతో కలిసి ఆయన ఏర్పాట్లపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో వైభవంగా నిర్వహించనున్నట్లు ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు. ఈ వేడుకల సందర్భంగా గౌరవ ముఖ్యమంత్రివర్యులు ముందుగా గన్ పార్కును సందర్శిస్తారని సీఎస్ తెలిపారు. అక్కడ ఉన్న తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద అమరవీరులకు ఘనంగా నివాళులర్పించిన అనంతరం పరేడ్ గ్రౌండ్ వేడుకల్లో పాల్గొంటారని వివరించారు. పరేడ్ గ్రౌండ్, గన్ పార్కు వద్ద చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. వేడుకల విజయవంతం కోసం ప్రతి శాఖ నుంచి ఒక నోడల్ అధికారిని నియమించి, అందరూ సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. ప్రముఖులు ప్రయాణించే మార్గాలలో అవసరమైన కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు శాఖను సీఎస్ ఆదేశించారు. ముఖ్యంగా పరేడ్ గ్రౌండ్‌కు వచ్చే వాహనాలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పార్కింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. ట్రాఫిక్ రూట్ మ్యాప్‌ను ముందుగానే సిద్ధం చేసి, ప్రజాలకు అంతరాయం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సభా ప్రాంగణంలో వాటర్ ప్రూఫ్ షామియానాలు, బారికేడింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్‌అండ్‌బీ శాఖను ఆదేశించారు. సభా ప్రాంగణం, పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనుల నిర్వహణతో పాటు తాగునీటి సౌకర్యాలు కల్పించాలన్నారు.

పండుగ వాతావరణంలో..

రాష్ట్రవ్యాప్తంగా పండుగ వాతావరణాన్ని తలపించేలా ఉత్తమ కళాకారులతో ప్రత్యేక ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని సాంస్కృతిక శాఖను సీఎస్ ఆదేశించారు. నగరంలోని ప్రముఖ ప్రదేశాలైన అసెంబ్లీ, రాష్ట్ర సచివాలయం, చార్మినార్, ప్రజాభవన్, ఇతర ప్రభుత్వ కార్యాలయాలను విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించాలన్నారు. నిరంతర విద్యుత్ సరఫరా కోసం జనరేటర్లను సిద్ధంగా ఉంచాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. వేడుకలను ప్రజలందరికీ చేరవేసేలా లైవ్ టెలికాస్ట్ ఏర్పాట్లు చేయాలని సమాచార శాఖ స్పెషల్ కమిషనర్‌ను ఆదేశించారు. ఈ నెల 25వ తేదీ నుంచి పరేడ్ గ్రౌండ్ వద్ద అన్ని విభాగాలు సంయుక్తంగా రిహార్సల్స్ చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, హోంశాఖ ముఖ్య కార్యదర్శి శిఖా గోయల్, కార్యదర్శి రఘునందన్ రావు పాల్గొన్నారు. వీరితో పాటు డీజీపీ (లా అండ్ ఆర్డర్) మహేశ్ భగవత్, ఏడీజీ (ఇంటలిజెన్స్) విజయ్ కుమార్, టీజీ జెన్‌కో సీఎండీ హరీష్, సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ ముకుంద రెడ్డి, జలమండలి ఎండీ అశోక్ రెడ్డి సహా పలువురు పోలీసు ఉన్నతాధికారులు, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు.

కామారెడ్డిలో తీరనున్న తాగునీటి కష్టాలు!

నీటి ఎద్దడి లేకుండా మున్సిపాలిటీ చర్యలు

అమృత్ 2.0 పథకంతో తొమ్మిది ట్యాంకుల నిర్మాణం

ఖాళీ బిందెలతో నిరసనలు తెలిపే రోజులు పోయాయి

మున్సిపల్ చైర్పర్సన్ నిట్టా ఉమారాణి వెల్లడి

కామారెడ్డి, మే 19 (మనసులో మాట): కామారెడ్డి పట్టణంలో ప్రజలకు ఎలాంటి నీటి ఎద్దడి లేకుండా పక్కా చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్పర్సన్ నిట్టా ఉమారాణి శ్రీనివాస్ తెలిపారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గత 20 సంవత్సరాల క్రితం కామారెడ్డి నియోజకవర్గంలో ఏ ప్రాంతానికి వెళ్లినా వర్షాకాలం మినహా మిగిలిన అన్ని రోజుల్లో తీవ్ర నీటి ఎద్దడి కనిపించేదని చైర్పర్సన్ గుర్తుచేశారు. ఆ రోజుల్లో ప్రజలు ఖాళీ బిందెలతో రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలిపే పరిస్థితి ఉండేదన్నారు. ఈ తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడమే తమ ప్రధాన ధ్యేయంగా ముందుకు సాగుతున్నట్లు వివరించారు.

అమృత్ పథకంతో కొత్త ట్యాంకులు

కామారెడ్డి పట్టణానికి ప్రస్తుతం 10 వాటర్ ట్యాంకులు అందుబాటులో ఉన్నాయని ఆమె తెలిపారు. వీటికి అదనంగా అమృత్ 2.0 పథకంలో భాగంగా చేపట్టిన మరో 9 వాటర్ ట్యాంకుల నిర్మాణ పనులు విజయవంతంగా పూర్తయ్యాయని వెల్లడించారు. వీటి ద్వారా పట్టణ ప్రజల దాహార్తి పూర్తిగా తీరనుందని నమ్మకం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ పర్వతాలు, డీఈ హనుమంతరావు, ఏఈ వినోద్, కౌన్సిలర్లు వాజిద్, జావేద్, అంజద్, బబ్లూ, నాయకులు కాళ్ల గణేష్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జొన్నల కొనుగోలు కోసం రోడ్డెక్కిన రైతులు!

జాతీయ రహదారిపై గంటపాటు రాస్తారోకో

నెల రోజులుగా మార్కెట్ యార్డులోనే నిల్వలు

గన్నీ బ్యాగులు లేక నిలిచిన ప్రక్రియ

రెండు రోజుల్లో కొంటామని తహసీల్దార్ హామీ

నిర్మల్, మే 19 (మనసులో మాట): జొన్నలను వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలోని మార్కెట్ యార్డు వద్ద స్వర్ణ-నిర్మల్ రహదారిపై మంగళవారం రైతులు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. రైతుల ఆందోళనతో జాతీయ రహదారికి ఇరువైపులా గంటపాటు వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

నెల రోజులుగా ఎదురుచూపులు

ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. సారంగాపూర్ మార్కెట్ యార్డుకు జొన్న పంటను తీసుకొచ్చి నెల రోజులు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి 20 రోజుల క్రితమే కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించినప్పటికీ, ఇప్పటివరకు గన్నీ బ్యాగులు అందుబాటులో లేకపోవడం వల్ల ఒక్క గింజ కూడా కొనలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం వాతావరణంలో వస్తున్న మార్పుల వల్ల ఈదురు గాలులు, ఉరుములు, వర్షాలు కురుస్తున్నాయని, ఓపెన్ యార్డులో ఉన్న జొన్నలు తడిసిపోతే తాము కోలుకోలేని విధంగా నష్టపోతామని ఆందోళన వ్యక్తం చేశారు.ధర్నా విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే ఘటన స్థలానికి చేరుకుని రైతులతో చర్చలు జరిపారు. అనంతరం తహసీల్దార్ విజయ్‌కాంత్‌రావుకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. తహసీల్దార్ స్పందిస్తూ.. ఈ సమస్యను జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. రాబోయే రెండు రోజుల్లో జొన్నల కొనుగోలు ప్రక్రియను పూర్తిస్థాయిలో ప్రారంభిస్తామని స్పష్టమైన హామీ ఇవ్వడంతో రైతులు తమ ఆందోళనను విరమించారు.

ఆదిలాబాద్ పర్యాటకంపై రీల్స్ పోటీలు!

జిల్లా వైభవాన్ని చాటేలా కలెక్టర్ పిలుపు

గెలిచిన క్రియేటర్లకు నగదు బహుమతులు

మే 21 ఉదయం 11 గంటల వరకే గడువు

సమాచార శాఖ ద్వారా అధికారిక ప్రకటన

ఆదిలాబాద్, మే 19 (మనసులో మాట): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక పర్యాటక వారోత్సవాలలో భాగంగా వినూత్నంగా 'ఇన్‌ఫ్లుయెన్సర్ రీల్స్ కాంపిటీషన్' నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. మావల పార్క్‌లో నిర్వహించిన ప్రెస్ టూర్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మీడియా ప్రతినిధులతో కలిసి సఫారీలో పాల్గొన్నారు. ఆదిలాబాద్ జిల్లాలోని అద్భుతమైన ప్రకృతి సంపద, జలపాతాలు, చారిత్రక వైభవం, స్థానిక ఆదివాసీ సంస్కృతిని ప్రపంచవ్యాప్తంగా ఉన్న పర్యాటకులకు పరిచయం చేసేందుకు జిల్లా యంత్రాంగం ఈ సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని కలెక్టర్ తెలిపారు. ఈ పోటీల నిర్వహణ వల్ల జిల్లా పర్యాటక ప్రాంతాలకు అంతర్జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, కంటెంట్ క్రియేటర్లు, మీడియా ప్రతినిధులు, సోషల్ మీడియా హ్యాండ్లర్స్ అందరూ ఈ పోటీల్లో పాల్గొనడానికి అర్హులని స్పష్టం చేశారు.

నిబంధనలు - గడువు వివరాలు

పోటీదారులు ఆదిలాబాద్ జిల్లాలోని పర్యాటక ప్రాంతాలు, ప్రకృతి అందాలు, జలపాతాలు, చారిత్రక కట్టడాలు, సంస్కృతిని ప్రతిబింబించేలా రీల్స్ లేదా వీడియోలను రూపొందించాల్సి ఉంటుంది. పోటీకి పంపే వీడియోలు తప్పనిసరిగా అత్యుత్తమ నాణ్యతతో (ఫోర్ కే ఫార్మాట్) ఉండాలి. ఆసక్తి గల క్రియేటర్లు ఈ నెల మే 21 గురువారం ఉదయం 11 గంటల లోపు తమ సొంత పెన్‌డ్రైవ్ ద్వారా జిల్లా కేంద్రంలోని విద్యుత్ తరంగిని ఫంక్షన్ హాల్‌లో నేరుగా వీడియోలను అందజేయాల్సి ఉంటుంది.పోటీలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రియేటర్లకు జిల్లా యంత్రాంగం తరఫున కింది విధంగా నగదు బహుమతులు అందజేస్తారు.

ఉద్యోగులు, పెన్షనర్లకు హెల్త్ కేర్ ట్రస్ట్!

- తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం
- ఈ నెల 31 లోపు వివరాల నమోదు తప్పనిసరి
- నగదు రహిత చికిత్స కోసం ప్రత్యేక డ్రైవ్
- ప్రభుత్వ నిర్ణయంపై ఉద్యోగ సంఘాల హర్షం

హైదరాబాద్, మే 19 (మనసులో మాట): తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ పెన్షనర్ల ఆరోగ్య భద్రత కోసం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. వారికి మరింత మెరుగైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో కొత్తగా 'ఎంప్లాయీస్ హెల్త్ కేర్ ట్రస్ట్' ఏర్పాటు చేసింది. ఈ కొత్త ఆరోగ్య పథకం అమలుకు సంబంధించి రాష్ట్ర ఆర్థిక శాఖ అన్ని ప్రభుత్వ శాఖలకు 'ఆదేశాలు' జారీ చేసింది. ఉద్యోగుల ఆరోగ్య సేవలను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ ప్రత్యేక ట్రస్ట్ ఎంతగానో ఉపయోగపడనుంది. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉద్యోగుల పూర్తి సమాచారాన్ని సేకరించేందుకు ప్రభుత్వం ఒక ప్రత్యేక డ్రైవ్ ప్రారంభించింది. ఆర్థిక శాఖ సూచనల ప్రకారం.. ప్రతి ఉద్యోగి, పెన్షనర్ తమ కుటుంబ సభ్యుల వివరాలతో కూడిన పూర్తి డేటాను తప్పనిసరిగా సమర్పించాల్సి ఉంటుంది. భార్య, భర్త, పిల్లలు, తమపై ఆధారపడిన వారి వివరాలన్నీ నమోదు చేయాలని స్పష్టం చేసింది. ఈ సమాచారం భవిష్యత్తులో నగదు రహిత చికిత్సతో పాటు ఇతర ఆరోగ్య సేవలను సులభంగా పొందేందుకు వీలు కల్పిస్తుంది. అన్ని శాఖల అధికారులు తమ పరిధిలోని ఉద్యోగుల వివరాలను ఈ నెల 31వ తేదీలోపు పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. నిర్ణీత గడువులోపు సమాచారాన్ని నమోదు చేయని పక్షంలో, భవిష్యత్తులో ఆరోగ్య పథకాల ప్రయోజనాలు పొందడంలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. ప్రస్తుతం అమల్లో ఉన్న వైద్య పథకాల్లోని లోపాలను సవరించి, వేగవంతమైన సేవలు అందించేందుకే ప్రభుత్వం ఈ నూతన విధానాన్ని తీసుకొచ్చింది. ఈ నిర్ణయం పట్ల రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తూ స్వాగతించాయి.

ఆదిలాబాద్‌లో అగ్నిగుండం.. మండుతున్న ఎండలు!

రికార్డు స్థాయిలో 44.6 డిగ్రీల ఉష్ణోగ్రత

వడగాల్పులతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న జనం

నిర్మానుష్యంగా మారుతున్న ప్రధాన రహదారులు

మరో నాలుగు రోజులు జాగ్రత్తగా ఉండాలన్న వాతావరణ శాఖ

ఆదిలాబాద్, మే 19 (మనసులో మాట): ఆదిలాబాద్ జిల్లాలో భానుడి ప్రతాపం రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతోంది. సోమవారం రికార్డు స్థాయిలో 44.6 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు కాగా, మంగళవారం కూడా అదే రకమైన పరిస్థితి నెలకొంది. మండుతున్న ఎండల కారణంగా ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి జంకుతున్నారు. ఉదయం 8 గంటలకే ప్రారంభమవుతున్న ఎండ తీవ్రత, సాయంత్రం 6 గంటల వరకు కొనసాగుతోంది. తీవ్రమైన ఎండకు తోడు వడగాల్పులు వీస్తుండటంతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఎండల ప్రభావంతో జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారులన్నీ మధ్యాహ్నం వేళ జనసంచారం లేక నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఎండ తీవ్రత నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు గొడుగులు, టోపీలు వాడుతున్నారు. కొందరు తలకు టవళ్లు చుట్టుకుని బయటకు వస్తున్నారు. బాటసారులు దాహార్తిని తీర్చుకునేందుకు మంచి నీరు, మజ్జిగ, లస్సీ, ఇతర చల్లని పానీయాలను ఆశ్రయిస్తున్నారు.

వైద్యుల కీలక సూచనలు

రాష్ట్రంలో మరో నాలుగు రోజుల పాటు ఎండల తీవ్రత ఇలాగే కొనసాగుతుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా, జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. అత్యవసర పనులు ఉంటే ఉదయం, సాయంత్రం వేళల్లోనే చూసుకోవాలని, మధ్యాహ్నం పూట ప్రయాణాలు వాయిదా వేసుకోవడం మంచిదని స్పష్టం చేస్తున్నారు. శరీరంలో నీటి శాతం తగ్గకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నారు.

పీఎంజే దొంగతనం కేసులో కీలక పరిణామం!

ధర్మపురిలో దొంగలు బస చేసిన లాడ్జి సీజ్

మున్సిపల్, పోలీస్ శాఖల సంయుక్త చర్యలు

ఆలస్యంగా స్పందించిన యంత్రాంగంపై విమర్శలు

వసతి గృహాల్లో భద్రతపై స్థానికుల ప్రశ్నలు

కరీంనగర్, మే 19 (మనసులో మాట): కరీంనగర్‌లోని పీఎంజే నగల దుకాణం దొంగతనం కేసు ధర్మపురి పుణ్యక్షేత్రంలో మరో కీలక అంశాన్ని వెలుగులోకి తెచ్చింది. ఈ దోపిడీకి పాల్పడిన నిందితులు బస చేసిన జగిత్యాల జిల్లా ధర్మపురిలోని విజయలక్ష్మి లాడ్జిని అధికారులు సీజ్ చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మున్సిపల్, పోలీస్ శాఖలు సంయుక్తంగా ఈ చర్యలు చేపట్టాయి. నిందితులు ఈ నెల 1వ తేదీ నుండి 3వ తేదీ ఉదయం 6 గంటల వరకు ఈ లాడ్జిలోనే బస చేసినట్లు విచారణలో తేలింది. ఇంతకాలం సదరు లాడ్జి నిబంధనలను ఉల్లంఘిస్తూ నడుస్తున్నా పట్టించుకోని అధికారులు, దొంగలు బస చేసి వెళ్లిన తర్వాతే అక్రమాలను గుర్తించడంపై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి రోజూ వందలాది మంది భక్తులు, యాత్రికులు వచ్చే ధర్మపురి వంటి ఆధ్యాత్మిక క్షేత్రంలో వసతి గృహాల నిర్వహణపై అధికారుల పర్యవేక్షణ ఏపాటిదో ఈ ఘటన స్పష్టం చేస్తోందని ఆరోపిస్తున్నారు.

లాడ్జీలలో కనీస నిబంధనలు పాటిస్తున్నారా, వచ్చే వారి వివరాలు సరిగ్గా నమోదు చేస్తున్నారా, సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయా అనే విషయాలపై నిరంతర తనిఖీలు లేకపోవడంపై మండిపడుతున్నారు. భారీ దొంగతనానికి పాల్పడిన నిందితులు రెండు రోజుల పాటు ఇక్కడే ఉన్నా ఎవరికీ అనుమానం రాకపోవడం, వారి కదలికలపై సరైన నిఘా లేకపోవడం భద్రతా లోపాలను ఎత్తిచూపుతోంది. కేవలం ఒక లాడ్జిని సీజ్ చేయడంతోనే సమస్య ముగిసిపోదని, అనుమతులు లేకుండా నడుస్తున్న ఇతర వసతి గృహాలపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. తాత్కాలిక హడావిడి చేయడం కంటే, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా భద్రతా వ్యవస్థలను బలోపేతం చేయడమే ముఖ్యమని, పుణ్యక్షేత్ర ప్రతిష్టను, భక్తుల భద్రతను కాపాడాలని కోరుతున్నారు.

ఐకేపీ వీఓఏల కనీస వేతనాల డిమాండ్!

సిరికొండ మండలంలో సమ్మె నోటీసులు అందజేత

రూ. 26 వేల వేతనంతో పాటు హెచ్ఆర్ పాలసీకి పట్టు

డిమాండ్లు పరిష్కరించకపోతే దశలవారీ పోరాటం

ఏపీఎం, ఎంపీడీఓ కార్యాలయాల్లో నోటీసుల సమర్పణ

కామారెడ్డి, మే 19 (మనసులో మాట): తెలంగాణ రాష్ట్రంలో పనిచేస్తున్న ఐకేపీ వీఓఏలకు కనీస వేతనాలు అందించాలనే డిమాండ్‌తో సిరికొండ మండల సమైక్య ఆధ్వర్యంలో మంగళవారం సమ్మె నోటీసులు అందజేశారు. వీఓఏలు అంతా కలిసి ఏపీఎం సువర్ణకు, ఎంపీడీఓ కార్యాలయంలో, పోలీస్ స్టేషన్‌లో ఈ నోటీసులను సమర్పించారు. ఐకేపీ వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి, వారికి హెచ్ఆర్ పాలసీని వర్తింపజేయాలని నాయకులు డిమాండ్ చేశారు. నెలకు రూ. 26 వేల కనీస వేతనం ఇవ్వడంతో పాటు, అర్హులైన వీఓఏలను గుర్తించి సీసీలుగా పదోన్నతి కల్పించాలని కోరారు. వీటితో పాటు రూ. 20 లక్షల బీమా సౌకర్యం వర్తింపజేయాలని, గ్రామాల్లో ఉచితంగా టాబ్, ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలని, అధికారిక ఐడీ కార్డులు అందజేయాలని డిమాండ్లలో పేర్కొన్నారు. జీవో నెంబర్ 58ని తక్షణమే సవరించాలని కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వేతనాల పెంపుతో పాటు, తమ దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని వీఓఏలు కోరారు. సమస్యలను పరిష్కరించని పక్షంలో దశలవారీగా పెద్ద ఎత్తున సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు మున్ సింగ్, జ్యోతి, సీహెచ్ లక్ష్మి, ఎస్ లక్ష్మి, సునీత, సారా, లావణ్య, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనకపోవడంతో రైతులకు అరిగోస!

ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేత బండ శ్రీనివాస్ ఆగ్రహం

క్వింటాల్‌కు రూ. 500 బోనస్ హామీ ఏమైందని ప్రశ్న

తరుగు పేరుతో దోచుకుంటున్న ప్రైవేట్ వ్యాపారులు

ప్రతి గింజా కొనకుంటే భారీ ఆందోళనల హెచ్చరిక

హుజూరాబాద్, మే 19 (మనసులో మాట): రాష్ట్ర ప్రభుత్వం రైతులు కష్టపడి పండించిన పంటను కొనుగోలు చేయకుండా తీవ్ర అరిగోస పెడుతోందని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి బండ శ్రీనివాస్ మండిపడ్డారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. క్వింటాల్ వరి ధాన్యానికి రూ. 500 బోనస్ ఇస్తామని రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రగల్భాలు పలికిందని బండ శ్రీనివాస్ గుర్తుచేశారు. ఇప్పుడు కనీసం పండించిన పంటను కూడా సకాలంలో కొనుగోలు చేయకపోవడం సిగ్గుచేటని ఆరోపించారు. గతంలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కల్లాల పైనే నేరుగా ధాన్యం కొనుగోలు చేసి రైతులకు అండగా నిలిచారని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

తరుగు పేరుతో ప్రైవేట్ దోపిడీ

ప్రభుత్వ అలసత్వాన్ని ఆసరాగా చేసుకుని ప్రైవేట్ వ్యాపారులు కొర్రీలు పెడుతున్నారని శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కో బస్తా మీద 4 నుంచి 5 కిలోల వరకు తరుగు తీస్తూ రైతును నిలువునా ముంచుతున్నారని తెలిపారు. దీనికి తోడు ప్రభుత్వ మద్దతు ధర కూడా చెల్లించడం లేదన్నారు. పాలకుల నిర్లక్ష్యం కారణంగా అన్నదాతలు తీవ్ర మానసిక క్షోభకు గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని విచారం వ్యక్తం చేశారు.

ఆందోళనల హెచ్చరిక

రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడిన చరిత్ర లేదనే సత్యాన్ని పాలకులు గ్రహించాలని బండ శ్రీనివాస్ హితవు పలికారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కళ్ళు తెరిచి తక్షణమే ప్రతి గింజను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతుల పక్షాన బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

ఇందిరమ్మ ఇల్లు ఆశ చూపి మహిళపై వేధింపులు!

కాంగ్రెస్ నేత బెస్ట్ చంద్రంపై పోలీసు కేసు

లొంగిపోవాలంటూ బాధితురాలికి ఒత్తిడి

పార్టీ నుంచి నిందితుడిని సస్పెండ్ చేసిన అధిష్టానం

రాజంపేట మండలంలో చోటుచేసుకున్న ఘటన

కామారెడ్డి, మే 19 (మనసులో మాట): ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయిస్తానని నమ్మబలికి, దానికి ప్రతిఫలంగా తన కోరిక తీర్చాలంటూ ఓ మహిళను వేధించిన ఘటన కామారెడ్డి జిల్లా రాజంపేట మండల కేంద్రంలో చోటుచేసుకుంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కాంగ్రెస్ పార్టీకి చెందిన సదరు నేతపై కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. రాజంపేట మండల కేంద్రానికి చెందిన ఒక మహిళ తనకు ఇందిరమ్మ ఇల్లు కావాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు బెస్ట్ చంద్రంను సంప్రదించింది. ఇల్లు మంజూరు చేయించాలంటే తనకు లొంగిపోవాలని, కోరిక తీర్చాలని అతడు ఆమెను తీవ్రంగా వేధించడం ప్రారంభించాడు. ఈ వేధింపులను భరించలేకపోయిన బాధితురాలు చివరికి రాజంపేట పోలీస్ స్టేషన్‌లో రాతపూర్వకంగా ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇందిరమ్మ ఇండ్ల విషయంలో మహిళపై అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు, పలువురి నుంచి డబ్బులు డిమాండ్ చేసినట్లు ఆరోపణలు రావడంతో బెస్ట్ చంద్రంపై పార్టీ అధిష్టానం కఠిన చర్యలు తీసుకుంది. అతడిని పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుండి సస్పెండ్ చేసినట్లు రాజంపేట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కృష్ణారావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక అధికారిక ప్రకటన విడుదల చేశారు.

ఏసీబీ వలకి చిక్కిన జీఎం!

జనరల్ మేనేజర్ కుమార్ ఇళ్లపై ఏకకాలంలో దాడులు

సోదాల్లో కుప్పలు తెప్పలుగా నగదు, కిలోల కొద్దీ బంగారం

నోట్ల లెక్కింపునకు కౌంటింగ్ మిషన్ల ఏర్పాటు

హైదరాబాద్, మే 19 (మనసులో మాట): హైదరాబాద్ జలమండలిలో ఒక భారీ తిమింగలం అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు చిక్కింది. ఆదాయానికి మించిన ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలపై జలమండలి జనరల్ మేనేజర్ కుమార్ నివాసాల్లో ఏసీబీ అధికారులు మంగళవారం తెల్లవారుజాము నుంచి సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భారీ ఎత్తున నగదు, బంగారం, వెండి, ఆస్తుల పత్రాలు బయటపడ్డాయి. మంగళవారం వేకువజాము నుంచే ఏసీబీ అధికారులు బృందాలుగా విడిపోయి హైదరాబాద్‌తో పాటు మొత్తం ఎనిమిది ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు చేపట్టారు. మల్లాపూర్‌లోని కుమార్ నివాసంలో ఏసీబీ డీఎస్పీ మజీద్ అలీ ఖాన్ ఆధ్వర్యంలో తనిఖీలు ప్రారంభమయ్యాయి. కుమార్‌తో పాటు ఆయన బంధువుల ఇళ్లలోనూ అధికారులు సోదాలు కొనసాగించారు. సోదాల్లో నోట్ల కట్టలను చూసి అధికారులు సైతం ఆశ్చర్యపోయారు. ఇళ్లలో ఎక్కడ చూసినా డబ్బు మూటలు కనిపించడంతో, ఆ నగదును లెక్కించడానికి ప్రత్యేకంగా కౌంటింగ్ మిషన్లను తెప్పించారు. ఈ తనిఖీల్లో దాదాపు ఒక కోటి ఇరవై లక్షల రూపాయల నగదు, ఒకటిన్నర కిలోల బంగారు ఆభరణాలు, రెండున్నర కిలోల వెండిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు.కేవలం నగదు, బంగారమే కాకుండా నిజామాబాద్ జిల్లాలో మూడు ఎకరాల వ్యవసాయ భూమి, హైదరాబాద్‌లోని ఒక గేటెడ్ కమ్యూనిటీలో మూడు ఫ్లాట్లు, ఆరు ఓపెన్ ప్లాట్లను అధికారులు గుర్తించారు. మల్లాపూర్‌లోని నివాసం వద్ద రెండు విలాసవంతమైన కార్లను సీజ్ చేశారు. వీటి మార్కెట్ విలువ ప్రాథమికంగా వంద కోట్ల రూపాయల వరకు ఉండవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. బ్యాంక్ లాకర్లను కూడా తెరిచి పరిశీలించేందుకు ఏసీబీ అధికారులు సిద్ధమవుతున్నారు.

పోడు భూముల సమస్యలను పరిష్కరిస్తాం!

- **గిరిజనులకు ఇబ్బంది లేకుండా సామరస్య చర్యలు**
- **కర్జవెల్లి గ్రామంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ పర్యటన**
- **బాధితులకు న్యాయం చేయాలని అధికారులకు ఆదేశం**
- **నివేదిక సమర్పించాలని అటవీ, రెవెన్యూ అధికారులకు సూచన**

ఆసిఫాబాద్, మే 19 (మనసులో మాట): గిరిజనులకు అటవీ ఇబ్బందులు లేకుండా పోడు భూముల సమస్యలను సామరస్యంగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల రాష్ట్ర కమిషన్ సభ్యులు జల్లా శంకర్ అన్నారు. మంగళవారం జిల్లాలోని చింతలమానేపల్లి మండలం కర్జవెల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ పర్యటనలో జిల్లా అదనపు కలెక్టర్ ఎం. డేవిడ్, కమిషన్ సభ్యుడు ప్రవీణ్ నిలక్క, మండల తహసీల్దార్ ప్రకాష్, అటవీ డివిజనల్ అధికారి అప్పన్న, గ్రామ సర్పంచ్ నారాయణ పాల్గొన్నారు. గత కొన్నేళ్లుగా సాగు చేసుకుంటున్న పోడు భూముల్లోని పంటలను అటవీశాఖ అధికారులు ధ్వంసం చేసి, చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారని రైతులు చేసిన ఫిర్యాదుపై కమిషన్ సభ్యులు స్పందించారు. గ్రామంలో నివసిస్తున్న ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, భూముల పరిస్థితులు, అటవీ ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. దాదాపు 50 దళిత, గిరిజన కుటుంబాలు తలా రెండు, మూడు ఎకరాల చొప్పున ఈ పంట సాగుపైనే ఆధారపడి జీవనోపాధి పొందుతున్నాయని ఈ సందర్భంగా గుర్తించారు.

అధికారుల వైఖరి మారాలి

ఎన్నో ఏళ్లుగా భూతల్లిని నమ్ముకుని జీవిస్తున్న రైతుల హక్కులను కాపాడేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందని జల్లా శంకర్ తెలిపారు. గిరిజనులకు అటవీ శాఖ నుండి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సంబంధిత అధికారులతో సమన్వయం చేసి చర్యలు చేపడతామన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి న్యాయం జరిగేలా అధికారులు పారదర్శకంగా పని చేయాలని సూచించారు. ఈ సమస్యలను త్వరితగతిన పరిశీలించి సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

యాదగిరిగుట్టలో తెలంగాణ కేబినెట్ భేటీ!

- **బాసర పుష్కరాల నేపథ్యంలో ఈ నెల 23కు వాయిదా?**
- **సచివాలయం దాటి పుణ్యక్షేత్రానికి పాలన**
- **అధికారిక ప్రకటన వెలువడటమే తరువాయి**

హైదరాబాద్, మే 19 (మనసులో మాట): రాజధాని వెలుపల మరోమారు తెలంగాణ మంత్రివర్గ సమావేశం జరగనుందని తెలుస్తోంది. గతంలో మేడారంలో కేబినెట్ నిర్వహించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తాజాగా ఇప్పుడు యాదగిరిగుట్టలో భేటీ అయ్యేందుకు సిద్ధమవుతున్నారు. ఈ నెల 21న జరగాల్సిన కేబినెట్ సమావేశాన్ని 23కు వాయిదా వేసి, యాదాద్రి క్షేత్రంలో నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రముఖ పుణ్యక్షేత్రమైన బాసరలో ప్రారంభం కానున్న సరస్వతి అంత్య పుష్కరాల కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

పుష్కరాల వల్లే వాయిదా

బాసర సరస్వతి అంత్య పుష్కరాలు ఈ నెల 21వ తేదీన ప్రారంభం కానున్నాయి. గోదావరి నది తీరాన జరిగే ఈ వేడుకలను తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఈ చారిత్రక కార్యక్రమానికి రాష్ట్ర మంత్రివర్గంలోని మెజార్టీ మంత్రులు హాజరు కానున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూడటం, ఏర్పాట్లను పర్యవేక్షించడం మంత్రులకు విధిగా మారింది. మంత్రులంతా పుష్కరాల విధుల్లో నిమగ్నం కానుండటంతో అదే రోజు నిర్వహించాల్సిన కేబినెట్ భేటీని వాయిదా వేయడమే ఉత్తమమని ప్రభుత్వం భావించింది.

యాదాద్రి వేదికగా కొత్త వ్యూహం

హైదరాబాద్‌లోని సచివాలయానికే పరిమితం కాకుండా, ప్రజలకు దగ్గరగా పాలనను తీసుకెళ్లాలనే ఆలోచనతో ముఖ్యమంత్రి ఈ వ్యూహాన్ని రచిస్తున్నారు. యాదగిరి లక్ష్మీనరసింహస్వామి కొలువై ఉన్న పవిత్ర క్షేత్రంలో కేబినెట్ భేటీ నిర్వహించడం ద్వారా ప్రత్యేక సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లవచ్చని భావిస్తున్నారు. గతంలో సమ్మక్క-సారలమ్మ జాతర సందర్భంగా రేవంత్ రెడ్డి మేడారంలో కేబినెట్ సమావేశాన్ని నిర్వహించారు. అక్కడికక్కడే ఏర్పాట్లు, నిధుల విడుదలపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఇప్పుడు అదే తరహా విధానాన్ని యాదగిరిగుట్టలోనూ అమలు చేయాలని చూస్తున్నారు. దీనివల్ల స్థానిక సమస్యలపై తక్షణమే స్పందించే అవకాశం లభిస్తుందని నమ్ముతున్నారు. అయితే ఈ తేదీ, వేదిక మార్పుపై ప్రభుత్వం నుండి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.